## మాదక ద్రవ్య రహిత జిల్లాకు కృషి

**-కలెక్టర్ రాహుల్ రాజ్**


మాట్లాడుతున్న కలెక్టర్, ఎస్పీ

మెదక్, మే 29 (నమస్తే తెలంగాణ) : మాదక ద్రవ్య రహిత జిల్లాగా మెదక్‌ను తీర్చిదిద్దేందుకు ప్రతిఒక్కరూ సహకరించాలని కలెక్టర్ రాహుల్ రాజ్ అన్నారు. ఐడీవోసీ కార్యాలయ సమావేశ మందిరంలో జిల్లాస్థాయి యాంటీ డ్రగ్ కమిటీ సమన్వయ సమావేశం ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డితో కలిసి గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థులు, యువత చెడు అలవాట్లకు దూరంగా ఉండాలన్నారు. మాదక ద్రవ్యాల వినియోగం లేకుండా పోలీసులు పటిష్ట చర్యలు చేపట్టాలన్నారు. గంజాయి, మత్తు పదార్థాలు దరిచేరకుండా కళాశాల యాజమాన్యాలు, తల్లిదండ్రులు పిల్లలపై దృష్టి పెట్టాలన్నారు. డ్రగ్స్, మాదక ద్రవ్యాల వల్ల కలిగే నష్టాలు, ఆరోగ్య పరిస్థితుల గురించి వైద్యాధికారులతో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. ఎస్పీ మాట్లాడుతూ భావితరాలు మాదక ద్రవ్యాల పై ఆకర్షితులు కాకుండా వారికి సమాజంలో మంచి, చెడు గురించి తెలియజేసేలా పోలీస్ యంత్రాంగం తరపున కృషి చేస్తున్నామన్నారు. నిరంతర తనిఖీలు నిర్వహించి గంజాయి మత్తు పదార్థాల రవాణాను అరికడుతున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో జడ్పీ సీఈవో ఎల్లయ్య, డీఎంహెచ్‌వో శ్రీరాం, రెవెన్యూ, పోలీసులు, అధికారులు పాల్గొన్నారు.

## సీజనల్ వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవాలి

పెద్దశంకరంపేట, మే 29: వానకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవాలని మండల వైద్యాధికారి షరీఫోద్దీన్ సిబ్బందికి సూచించారు. గురువారం స్థానిక పీహెచ్‌సీలో వైద్య సిబ్బందితో సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. పరిశుభ్రత పాటించాలన్నారు. గుంతలున్న చోట నీరు నిల్వ ఉండకుండా చూడాలన్నారు. తహసీల్దార్ శ్రీనివాస్, ఇన్‌చార్జి ఎంపీడీవో షాకిర్‌అలీ, ఎంఈవో వెంకటేశం, సిబ్బంది ఉన్నారు.

## అధిక దిగుబడులు వచ్చే వంగడాలు వేసుకోవాలి


రైతులకు అవగాహన కల్పిస్తున్న వ్యవసాయశాఖ,కృషి విజ్ఞాన్ కేంద్రం శాస్త్రవేతలు

చేగుట, మే29: అధిక దిగుబడులు ఇచ్చే వరి వంగడాలను వేసుకోవాలని ఏవో హరిప్రసాద్, కృషి విజ్ఞాన్ కేంద్రం శాస్త్రవేతలు పేర్కొన్నారు. కేంద్ర వ్యవసాయ, రైతు సంక్షేమ మంత్రిత్వ శాఖ వికసిత్ కృషి సంకల్ప్ అభయాన్‌లో భాగంగా నార్సింగి మండలంలోని నర్సంపల్లి పెద్ద తండాలో గురువారం వికసిత్ కృషి సంకల్ప్ అభియాన్‌పై అవగాహన కల్పించారు. రోజుకు మూడు గ్రామాల చొప్పున పాటు 45 గ్రామాల్లో పర్యటిం చి, వానకాలంలో మేలు రకం వంగడాలపై అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు. కా ర్యక్రమంలో డాక్టర్ రామానాయుడు, ఏకల వ్య గ్రామీణ వికాస్ ఫౌండేషన్ కృషి విజ్ఞాన్ కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ పాపారావు, వ్యవసాయ విస్తరణ అధికారి విజృంభణ పాల్గొన్నారు.

## గొర్రెలు, బర్రెలు షెడ్ల నిర్మాణంపై అవగాహన

చిన్నశంకరంపేట, మే29: గొర్రెలు, బర్రెల షెడ్ల నిర్మాణంపై రైతులకు అవగాహన కల్పించాలని డీఆర్డీఏ పీడీ శ్రీనివాస్‌రావు అన్నారు. గురువారం చిన్నశంకరంపేట ఎంపీపీ కార్యాలయంలో ఉపాధి పనులపై సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధి పనులు కల్పించేందుకు కూలీలకు సహకరించాలని ఫీల్డ్ అసిస్టెంట్లను ఆదేశించారు. సబ్సిడీ రూపంలో నిర్మించుకునేందుకు రైతులకు సహకరించాలన్నారు. ఈ అవకాశాన్ని రైతులు వినియోగించుకోవాలని సూచించారు. సమావేశంలో ఎంపీడీవో దామోదర్, ఏపీవో రాజ్‌కుమార్, ఉపాధి టెక్నికల్ అసిస్టెంట్లు, పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

## మహంకాళి ఆలయంలో చోరీ

తూప్రాన్, మే 29: తూప్రాన్‌లోని మహంకాళి అమ్మవారి ఆలయంలో బుధవారం రాత్రి దుండగులు చోరీకి పాల్పడ్డారు. ఎస్ఐ శివానందం తెలిపిన వివరాల ప్రకారం.. బుధవారం రాత్రి ఆలయ పూజారి బొల్లు మాణిక్యం గుడికి తాళం వేసి ఇంటికి వెళ్లిపోయాడు. తెల్లవారుజామున యథావిధిగా పూజ చేసేందుకు వచ్చి చూడగా గ్రిల్స్ సగం తెరిచి ఉన్నాయి. లోపలికి వెళ్లి చూడగా రెండు హుండీల్లో ఉన్న చిల్లర డబ్బులు దొంగలించినట్లు గుర్తించారు. పూజారి ఫిర్యాదు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

## అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి


ఘటన స్థలాన్ని పరిశీలిస్తున్న డీఎస్పీ

మనోహరాబాద్, మే 29: వలస కూలీ అనుమానాస్పదస్థితిలో మృతి చెందిన ఘటన మనోహరాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్ఐ సుభాష్‌గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. కేరళ రాష్ర్టానికి చెందిన నలీన్‌కుమార్ (40) ఉపాధి నిమిత్తం మనోహరాబాద్ మండలం కాళ్లకల్ పారిశ్రామిక వాడలోని కిసాన్ ఇండస్ట్రీ పరిశ్రమలో పని చేస్తున్నాడు. పరిశ్రమకు చెందిన గదుల్లో మరో వ్యక్తితో కలిసి ఉంటున్నాడు. గురువారం అనుమానాస్పద స్థితిలో మృతి చెంది ఉన్నాడు. విషయం తెలుసుకున్న తూప్రాన్ డీఎస్పీ నాగేందర్‌గౌడ్, సీఐ రంగాకృష్ణ ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతుడితో పాటు ఉండే మరో వ్యక్తి నలీన్‌కుమార్‌ను హత్య చేసి ఉంటాడని పోలీసులు భావిస్తున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

## చిన్న పిల్లల చెవిపోగులు చోరీ

కౌడిపల్లి, మే29: ఇంటిముందు ఆడుకుంటున్న చిన్న పిల్లల చెవిపోగులను పట్టపగలే చోరీ చేసిన ఘటన కౌడిపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో గురువారం చోటుచేసుకున్నది. ఎస్ఐ రంజిత్‌కుమార్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం .. కౌడిపల్లి గ్రామానికి చెందిన రాజం శ్రీకాంత్‌కు ముగ్గురు కూతురులు. పెద్ద కూతురు రాజం అక్షిత(6), రెండో కూతురు సహస్ర(5), చిన్న కూతురు తన్విక 5నెలలు. గురువారం తమ ఇంటిముందు ఆడుకుంటుండగా గుర్తు తెలియని వ్యక్తులు మాయమాటలు చెప్పి పక్కకు తీసుకెళ్లి అక్షిత, సహస్రల చెవిపోగులు కత్తిరించుకు పోయారు. వెంటనే పిల్లలు ఏడ్చుకుంటూ ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులకు తెలిపారు. గమనించిన కుటుంబ సభ్యులు చుటుపక్కల వెతికినా ఎవరూ కనిపించలేదు. వీటి విలువ అర తులం వరకు ఉంటుంది. రాజం శ్రీకాంత్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్నున్నామని ఎస్ఐ తెలిపారు.

## కేసీఆర్ కాలనీలో డ్రైనేజీ పనులు



రామాయంపేట, మే 29: రామాయంపేట పట్టణ శివారులోని కేసీఆర్ కాలనీలో డ్రైనేజీ పనులను పురపాలిక అధికారులు ప్రారంభించారు. గురువారం కాలనీకి చేరుకున్న అధికారులు పనులు మొదలు పెట్టారు. గత నెల రోజులుగా మురుగు నీటితో ఇబ్బందులు పడుతున్న కాలనీవాసులు సంతోషం వ్యక్తం చేశారు. మాజీ కౌన్సిలర్ గజవాడ నాగరాజు, వర్క్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, మురళి ఉన్నారు.

## ప్రతిభ కనబరిస్తే ఉన్నతమైన జీవితం

పెద్దశంకరంపేట/పాపన్నపేట, మే29: పదో తరగతి పూర్తి చేసుకున్న విద్యార్థులు ఉన్నత చదవులు చదవి అత్యుత్తమ ప్రతిభ కనబర్చి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులకు పేరు తీసుకురావాలని ఎంఈవో వెంకటేశం అన్నారు. గురువారం స్థానిక ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో పదో తరగతి పూర్తి చేసుకున్న విద్యార్థినులకు ఇంటర్మీడియెట్, పాలిటెక్నిక్ కెరీర్ గైడెన్స్‌పై ఎంఈవో అవగాహన కల్పించారు. పాపన్నపేట మండలంలోని నాగ్సాన్‌పల్లి ఉన్నత పాఠశాలలో 10వ తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులకు కేరీర్ గైడెన్స్ నిర్వహించారు. నచ్చిన కోర్సును ఎంపిక చేసుకుని చదువు కొనసాగించాలన్నారు. పాపన్నపేట కళాశాల లెక్చరర్ రమేష్,ప్రవీణ్‌కుమార్, నజీరోద్దిన్, అశోక్‌కుమార్ పాల్గొన్నారు.

# జిల్లాలో రికార్డు స్థాయిలో ధాన్యం సేకరణ

- ఈ సీజన్లో 25 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు
- 223 కేంద్రాల్లో కొనుగోళ్లు పూర్తి
- కలెక్టర్ రాహుల్‌రాజ్
- హవేళీఘనపూర్ మండలం బూరుగుపల్లిలోని కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించిన కలెక్టర్
- రోడ్డు భద్రతా నియమాలను కఠినంగా అమలు చేయాలి
- ఎస్పీ ఉదయ్ కుమార్ రెడ్డి


బూర్గుపల్లి కొనుగోలు కేంద్రంలో ధాన్యాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ రాహుల్‌రాజ్


మాట్లాడుతున్న కలెక్టర్ రాహుల్‌రాజ్, ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి, పాల్గొన్న అధికారులు

మెదక్, మే 29 (నమస్తే తెలంగాణ): యాసంగి సీజన్‌లో రికార్డు స్థాయిలో ధాన్యం కొనుగోళ్లు చేసినట్లు కలెక్టర్ రాహుల్‌రాజ్ తెలిపారు. గత సీజన్‌తో పోలిస్తే ఈ సీజన్లో 25వేల మెట్రిక్ టన్నుల ధాన్యం అదనంగా కొని, వేగంగా రైతుల అకౌంట్లో డబ్బులు జమ చేసేలా చర్యలు తీసుకున్నామని కలెక్టర్ తెలిపారు. గురువారం హవేళీఘనపూర్ మండలం బూరుగుపల్లి గ్రామంలోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని తహసీల్దార్ సింధురేణుకతో కలిసి కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో యాసంగి సీజన్‌లో వడ్ల సేకరణ కోసం మొత్తం 496 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. ధాన్యం కొనుగోళ్లు తుది దశలో ఉన్నాయని, వారం రోజుల్లో అన్ని కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం పూర్తిగా కొని, మిల్లులకు తరలిస్తామన్నారు. బూర్గుపల్లి కొనుగోలు కేంద్రంలో ధాన్యం కొనుగోలు ప్రక్రియ తుది దశలో ఉన్నందున త్వరితగతిన ధాన్యాన్ని కొని మిల్లుకు తరలించాలని నిర్వాహకులను ఆదేశించారు. గత యాసంగి 2023-24 సీజన్‌లో 2,60,381.440 మెట్రిక్ టన్నుల ధాన్యం కొని, రూ.448.18 కోట్లు చెల్లించడంతో 61,108 మంది రైతులకు ప్రయోజనం చేకూరిందన్నారు. 2024 -2025 యాసంగి సీజన్లో ఈ నెల 29 నాటికి జిల్లాలో 2,85,446,960 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించి రూ.579.96 కోట్లు రైతులకు చెల్లించినట్లు పేర్కొన్నారు. దీంతో 68,588 మంది రైతులకు లబ్ధి చేకూరిందన్నారు. గత సీజన్‌తో పోలిస్తే ఈ సీజన్లో 25వేల మెట్రిక్ టన్నుల ధాన్యం అదనంగా కొనుగోలు చేశామన్నారు. రైతులెవరూ ఆందోళన చెందవద్దని, చివరి గింజ వరకు ధాన్యం సేకరిస్తామని తెలిపారు. తడిసిన ధాన్యాన్ని సైతం సేకరిస్తామని స్పష్టం చేశారు.

### రోడ్డు భద్రతను మెరుగుపర్చాలి

రోడ్డు భద్రతను మెరుగుపర్చాలని, తద్వారా ప్రజలు ప్రాణాలను కాపాడవచ్చని కలెక్టర్ రాహుల్‌రాజ్ తెలిపారు. రోడ్డు భత్రతా నియమాలను కఠినంగా అమలు చేయాలని ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం సమీకృత కలెక్టరేట్ లో రహదారి భద్రతపై జిల్లా స్థాయి నెలవారి సమీక్ష నిర్వహించారు. ముందుగా రహదారి భద్రత, ప్రమాదాలు జరిగే బ్లాక్ స్పాట్స్, నేషనల్ హైవే ద్వారా చేపట్టే ప్రణాళికలను చర్చించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. రోడ్డు భద్రతపై ప్రమాదాలు నివారించి, ప్రజలను రక్షించాలన్నారు. రహదారి ప్రమాదాలను తగ్గించడానికి తీసుకోవాల్సిన చర్యలపై పక్కా ప్రణాళికతో క్షేత్రస్థాయిలో అమలు చేయాలన్నారు. ఎస్పీ ఉదయ్ కుమార్‌రెడ్డి మాట్లాడుతూ రోడ్డు భద్రతా నియమాలు కఠినంగా అమలు చేస్తున్నామని, తనిఖీలు నిర్వహిస్తు, వాహనచోదకులు నిబంధనలు పాటించాలని ఎప్పటికప్పుడు ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామన్నారు. వివిధ శాఖల అధికారుల సమన్వయంతో భద్రతా చర్యలు చేపడుతున్నామన్నారు. కార్యక్రమంలో ఆర్‌అండ్‌బీ ఏఈ సర్దార్ సింగ్, మెదక్ డీఎస్పీ ప్రసన్నకుమార్, నేషనల్ హైవే, పోలీస్, రెవెన్యూ, రవాణా, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

## విద్యుత్ స్తంభాలకు మరమ్మతులు ఎప్పుడు ?


పొలంలో విరిగి పడి ఉన్న విద్యుత్ స్తంభం


వేలాడుతున్న విద్యుత్ వైర్లను చెట్టుకు కట్టిన దృశ్యం


భూమిని సాగుకు సిద్ధంగా చేసిన రైతు

కొల్చారం, మే 29: ఇటీవల కురిసిన గాలి వాన బీభత్సానికి మండల వ్యాప్తంగా పలు చోట్ల విద్యుత్ స్తంభాలు విరిగిపడ్డాయి. విద్యుత్ అధికారులు గ్రామాల్లో, ప్రధాన రహదారుల వెంబడి ఉన్న విద్యుత్ లైన్లకు మరమ్మతులు చేపట్టినప్పటికీ, పొలాల్లో పడిపోయిన స్తంభాలను వదిలేశారు. రెండు నెలలు గడుస్తున్నా మరమ్మతులు చేపట్టలేదు. రైతులు నార్లు విత్తుకునేందుకు సిద్ధపడుతున్నారు. విద్యుత్ అధికారులు నార్లకు ముందే దెబ్బతిన్న విద్యుత్ లైన్లను సరి చూసుకుని మరమ్మతులు చేపట్టాల్సిన అవసరం ఉంది. వర్షాలు పడితే పనులకు ఆటంకం కలుగుతాయి. దీనికి తోడు రైతులు నార్లు విత్తుకోవడానికి బోరు బావులే ఆధారం. విద్యుత్ లైన్ ధ్వంసం కావడంతో బోరు మోటర్లు నడిచే పరిస్థితి లేదు. ఈ విషయమై మండల విద్యుత్ అధికారి హైమద్ అలీని వివరణ కోరగా మండలంలో కొన్ని చోట్ల విద్యుత్ స్తంభాల మరమ్మతులు అసంపూర్తిగా ఉన్న మాట వాస్తవమేనన్నారు. తమ వద్ద విద్యుత్ స్తంభాలు లేనందున మరమ్మతులకు ఆలస్యం అయ్యిందన్నారు. ఉన్నతాధికారులకు దరఖాస్తు పెట్టామని, అక్కడి నుంచి స్తంభాలు వచ్చిన వెంటనే మరమ్మతులు చేపడతామని తెలిపారు.

## నాసిరకం విత్తనాలు అమ్మితే కఠిన చర్యలు

మెదక్ రూరల్, మే 29: నాసిరకం విత్తనాలు అమ్మితే కఠిన చర్యలు తీసుకుంటామని మెదక్ డివిజన్ వ్యవసాయ అధికారి విజయనిర్మల హెచ్చరించారు. గురువారం మెదక్ పీఏసీఎస్‌లో విత్తనాలు, ఎరువులను తనిఖీ చేశారు. జనుము, జీలుగ విత్తనాలను 65 శాతం సబ్సిడీపై ఇస్తున్నామన్నారు. ఆమె వెంట ఏఈవో శ్రీనివాస్, సిబ్బంది ఉన్నారు.

### విత్తనాల కొనుగోళ్ల లో జాగ్రత్త వహించాలి


మెదక్‌లో రైతులకు అందజేస్తున్న ఏడీ, ఏవో


నర్సాపూర్‌లో విత్తన దుకాణాల తనిఖీ ఏవో, ఎస్సై

నర్సాపూర్, మే 29: విత్తనాలు కొనే ముందు రైతులు జాగ్రత్త వహించాలని ఏవో దీపిక పేర్కొన్నారు. మండలంలోని ఖాజీపేట్, బ్రాహ్మణపల్లి, ఆవంచ గ్రామాల్లో శాస్త్రవేత్తలు, వ్యవసాయాధికారులు రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు-అన్నదాతలకు గురువారం అవగాహన కల్పించారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు డా.శాంతి, డా.రవీందర్‌నాయక్, డా.అమీర్‌పాషా, డా.సుశీల, డా.రాధిక, ఏఈవోలు దుర్గాప్రసాద్, రవివర్మ, లక్ష్మి పాల్గొన్నారు. డీలర్లు నిబంధనలు ఉల్లంఘిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఏవో దీపిక, ఎస్సై లింగం హెచ్చరించారు. నర్సాపూర్‌లోని విత్తన దుకాణాల్లో టాస్క్‌ఫోర్స్ టీమ్ తనిఖీలు చేశారు. డీలర్లు ఎప్పటికప్పుడు వ్యవసాయ శాఖ వారికి రిపోర్టు చేయాలని, స్టాక్ రిజిస్టర్లు రోజు వారి అప్‌డేట్ చేయాలని ఆదేశించారు.

### అందుబాటులో జీలుగ విత్తనాలు

చిన్నశంకరంపేట, మే29: ప్రభుత్వం రాయితీపై అందించే జీలుగ విత్తనాలు మండల వ్యవసాయ కార్యాలయంలో అందుబాటులో ఉన్నాయని ఏవో లక్ష్మీప్రవీణ్ తెలిపారు. రైతులు పట్టాపాసు పుస్తకం, ఆధార్ కార్డు జిరాక్సులను తీసుకొచ్చి పొందవచ్చన్నారు. 30కేజీల బస్తా ధర రూ.2138 అని, బస్తా విత్తనాలు రెండున్నర ఎకరాలకు సరిపోతాయని తెలిపారు.

## పోషణ లోపం ఉన్న చిన్నారులను గుర్తించాలి


మాట్లాడుతున్న జిల్లా మహిళా శిశు సంక్షేమ అధికారి హైమావతి

అల్లాదుర్గం,మే 29: ప్రతి నెలా అంగన్‌వాడీ కేంద్రాలను సూపర్‌వైజర్లు సందర్శించాలని జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారి హైమావతి అన్నారు.అల్లాదుర్గం ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని నీలకంఠపల్లి అంగన్‌వాడీ కేంద్రాన్ని గురువారం తనిఖీ చేశారు. కేంద్రంలో నిల్వ ఉన్న పోషణ ఆహార పదార్థాలను పరిశీలించారు. అనంతరం అల్లాదుర్గంలోని సీడీపీవో కార్యాలయంలో ప్రాజెక్టు పరిధిలోని సూపర్‌వైజర్లతో సమీక్షా సమావేశం నిర్వహించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో పోషణ లోపంతో ఉన్న చిన్నారులను గుర్తించి అనుబంధ పోషకాహారం అందించాలని సూచించారు. అమ్మమాట- అంగన్‌వాడీ బాట కార్యక్రమం ద్వారా పిల్లలను అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించి చిన్నారుల సంఖ్య పెంచాలన్నారు. సమావేశంలో సీడీపీవో పద్మలత, పోషన్ అభియాన్ జిల్లా సమన్వయ కర్త కుర్మ వెంకట్, సూపర్‌వైజర్లు నాగమణి, కృష్ణవేణి, శ్రీశైలమ్మ, పుష్పలత, భాగమ్మ పాల్గొన్నారు.

## బ్రెడ్ అమ్మకందారుడికి జరిమానా

తూప్రాన్, మే 29: పట్టణంలో కాలం చెల్లిన బ్రెడ్‌ను దుకాణాల్లో సరఫరా చేస్తున్నారని బాధితుడు నవీన్ మున్సిపల్ అధికారులకు ఫిర్యాదు చేశాడు. దీంతో శానిటరీ ఇన్‌స్పెక్టర్ మధు ఆధ్వర్యంలో పలు దుకాణాల్లో దాడులు నిర్వహించారు. కాలం చెల్లిన బ్రెడ్‌ను దుకాణాలకు సరఫరా చేసిన శ్రీనివాస్‌రెడ్డికి గురువారం రూ.1500 జరిమానా విధించారు. కాలం చెల్లిన తినుబండారాలు విక్రయిస్తే చర్యలు తప్పవని శానిటరీ ఇన్‌స్పెక్టర్ మధు హెచ్చరించారు. తూప్రాన్‌లోని పలు పాల కేంద్రాల్లో తయారు చేసిన తినుబండారాలు, కాలం చెల్లిన, తేదీలు లేని పలు రకాల పచ్చళ్లు, బ్రెడ్లు, ఇతర వస్తువులను దుకాణాల్లో విక్రయిస్తున్నా ఇంతవరకూ అధికారులు పట్టించుకోకపోవడం గమనార్హం.

## సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల అందజేత



తూప్రాన్, మే 29: తూప్రాన్ మున్సిపల్‌లోని 11వ వార్డు పడాలపల్లికి చెందిన పలువురు లబ్ధిదారులకు తూప్రాన్ మున్సిపల్ మాజీ చైర్మన్ రాఘువేందర్ గౌడ్ ఆధ్వర్యంలో గురువారం చెక్కులు పంపిణీ చేశారు. వెంగలి స్వామి రూ. 13 వేలు, నడిపల్లి యాదమ్మ రూ.22,500, తుప్పతి భిక్షపతి రూ. 22,500, తుప్పతి మల్లమ్మ రూ. 12,500 ల చెక్కులు అందించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ బొంది వెంకట్ గౌడ్, బీఆర్‌ఎస్ గ్రామ అధ్యక్షుడు లంబ రాజు యాదవ్, మాజీ వార్డు మెంబర్ కానుకుంట సుదర్శన్, వెంగలి మహేశ్ పాల్గొన్నారు.

### నేటి నుంచి దోస్త్ ప్రవేశాలకు దరఖాస్తులు

మెదక్ మున్సిపాలిటీ, మే 29: జిల్లా కేంద్రంలోని గిరిజన సంక్షేమ మహిళా డిగ్రీ కళాశాలలో శుక్రవారం నుంచి దోస్త్ ప్రవేశాలకు రెండో దఫా దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ప్రిన్సిపాల్ ఉమాదేవి గురువారం ప్రకటనలో తెలిపారు. బీఏ, బీఎస్సీ, బీకాం గ్రూపుల్లో ఖాళీ సీట్లు భర్తీ చేయనున్నట్లు పేర్కొన్నారు. జూన్ 8వ తేదీ వరకు దోస్త్ వెబ్‌సైట్‌లో ఐడీ క్రియేట్ చేసి కళాశాలలో సంప్రదించాలని తెలిపారు. గిరిజన విద్యార్థినులకు మాత్రమే అవకాశం ఉందని, వివరాలకు 7901097706 నంబర్‌ను సంప్రదించాలన్నారు.

### బాధిత కుటుంబానికి కంఠారెడ్డి పరామర్శ



నిజాంపేట, మే 29: బచ్చురాజ్‌పల్లికి చెందిన బీఆర్‌ఎస్ నేత నరేందర్‌నాయక్ తండ్రి మంగ్యానాయక్ రెండు రోజుల క్రితం మృతి చెందాడు. బీఆర్‌ఎస్ నాయకుడు కంఠారెడ్డి తిరుపతిరెడ్డి గురువారం బాధిత కుటుంబీకులను పరామర్శించారు.

### రేణుకామాత విగ్రహ ప్రతిష్ఠోత్సవాలు ప్రారంభం

నర్సాపూర్, మే29: గొల్లపల్లిలో రేణుకా మాత విగ్రహ ప్రతిష్ఠోత్సవాలు ప్రారంభమయ్యాయి. గురువారం గణపతిపూజ, గురుపూజ, గోపూజ, రక్షాబంధనం, యాగశాల ప్రవేశం, యోగిని వాస్తు, తీర్థ ప్రసాద వితరణ కార్యక్రమాలు చేపట్టారు. ఆలయ నిర్మాత మల్లేశ్‌గౌడ్, అర్చకుడు హరిప్రసాద్‌శర్మ, భక్తులు పాల్గొన్నారు.

### మనస్తాపంతో యువకుడి ఆత్మహత్య


గణేశ్ (ఫైల్)

రామాయంపేట, మే 29: మనస్తాపంతో యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన రామాయంపేట పోలీస్‌స్టేషన్ పరిధిలోని దామరచెర్వు గ్రామంలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. గంగిరెడ్డి గణేశ్ (23) కొంత కాలంగా ఏపని చేయకుండా తిరుగుతుండేవాడు. కొద్దిరోజులు హైదరాబాద్‌లో ఉండి ఈ మధ్యనే స్వగ్రామానికి వచ్చాడు. ఇంట్లో వారు ఏదైనా పని చేసుకోవాలన్నారు. దీంతో తన గృహంలోనే ఇంట్లో దూలానికి ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. విషయం తెలుసుకున్న పోలీసులు మృతదేహానికి పంచనామా నిర్వహించి, పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ దవాఖానకు తరలించారు. మృతుడి కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని విచారణ చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

### విద్యాశాఖకు మంత్రిని నియమించాలి

మెదక్ మున్సిపాలిటీ, మే 29: రాష్ట్రంలో విద్యావ్యవస్థ నిర్వీర్యం అవుతున్నదని, దాన్ని గాడిలో పెట్టేందుకు విద్యాశాఖ మంత్రిని నియమించాలని బీఆర్‌ఎస్వీ జిల్లా నాయకుడు కసాపురం కిరణ్ గురువారం ప్రకటనలో డిమాండ్ చేశారు. విద్యావ్యవస్థను ప్రక్షాళన చేస్తామని చెప్పి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. ఉమ్మడి మెదక్ జిల్లాలో వివిధ కళాశాలలు ఫీజుల రూపంలో దోపిడీకి పాల్పడుతున్నాయని ఆరోపించారు. కొన్ని కళాశాలలు ఏ మాత్రం ప్రభుత్వ నిబంధనలు పాటించడం లేదన్నారు. కేవలం ఫీజు రీయింబర్స్‌మెంట్ కోసమే కొనసాగుతున్నాయన్నారు. రాష్ట్ర ప్రభుత్వం స్పందించి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

### సర్వీస్ రోడ్డు మూసివేయవద్దని ఆందోళన


రోడ్డు పనులు ఆపాలని ఆందోళన చేస్తున్న గొల్పర్తివాసులు

రామాయంపేట, మే 29: సర్వీస్ రోడ్డును ఆర్‌అండ్‌బీ హైవే అధికారులు మూసి వేసే పనులను మున్సిపాలిటీలోని గొల్పర్తికి చెందిన రైతులు, గ్రామస్తులు గురువారం అడ్డుకుని ఆందోళనకు దిగారు. అక్కడే ఉన్న కాంట్రాక్టర్‌తో వాగ్వాదానికి దిగారు. రోడ్డుపై నిర్మాణానికి సిద్ధంగా ఉన్న సెంట్రింగ్ రేకులను తీసివేశారు. హైవేపై రోజూ ప్రమాదాలు జరుగుతున్నా వాటిని పట్టంచుకోకుండా తాము వ్యవసాయ బావులకు వెళ్లే మార్గాన్ని మూసివేయడం తగదన్నారు. ముందు అండర్‌పాస్ బ్రిడ్జి నిర్మించాలని, తర్వాతే సర్వీస్ రోడ్డు పనులు చేపట్టాలని డిమాండ్ చేశారు. విషయం తెలుసుకున్న ఎస్సై బాలరాజు, నాయకులు అక్కడికి చేరుకుని సంబంధిత అధికారులతో ఫోన్‌లో చర్చలు జరిపారు. హైకోర్టు నుంచి ఆర్డర్ కాపీ వచ్చిందని అధికారులు తెలిపారు.

### డ్రోన్ వినియోగంపై రైతులకు అవగాహన


డ్రోన్ వినియోగంపై రైతులకు వివరిస్తున్న శాస్త్రవేత్తలు

నిజాంపేట, మే 29: నస్కల్ రైతువేదికలో కేవీకే తునికి అధ్వర్యంలో వికసిత కృషి సంకల్ప అభియాన్ కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. సమగ్ర సస్యరక్షణ చర్యలు, వరిలో యాజమాన్య పనులు, వివిధ స్కీములతో పాటు మందుల పిచికారీలో డ్రోన్ వినియోగంపై వ్యవసాయ శాస్త్రవేత్తలు చిన్నబాబునాయక్, జాసుదాసు, శ్రీకాంత్ వివరించారు. కార్యక్రమంలో ఏవో సోమలింగారెడ్డి, ఏఈవో శ్రీలత, మాజీ ఎంపీపీ సిద్ధిరాములు, రైతులు నగేశ్‌యాదవ్, లింగంగౌడ్, సంజీవ్, రాజు, వెంకటేశ్, నారాయణ ఉన్నారు.

### అదుపుతప్పి వడ్ల లారీ బోల్తా



నిజాంపేట గ్రామ శివారులో బోల్తా పడిన వడ్ల లారీ

నిజాంపేట, మే29: నిజాంపేట శివారులోని రైతువేదిక సమీపంలో ధాన్యంతో వెళ్తున్న లారీ అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ఘటనలో లారీడ్రైవర్ గాయాలతో బయటపడ్డాడు. రామాయంపేటలోని ఓ రైస్‌మిల్లు నుంచి ఆంధ్రాకు వెళ్తున్న లారీ నిజాంపేట శివారులో ప్రమాదానికి గురైంది. శీరికవాగు బ్రిడ్జిని ఇరుకుగా నిర్మించడంతోనే ప్రమాదం జరిగిందని, గతంలో ఈ బ్రిడ్జి వల్లే పికప్ ట్రక్ అదుపు తప్పి ఒకరు మృతి చెందారని స్థానికులు తెలిపారు. ఘటనా స్థలానికి నిజాంపేట పోలీసులు చేరుకుని రోడ్డుపై పడి ఉన్న ధాన్యాన్ని పక్కకు తొలిగించారు.

### నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం


రామాయంపేట, మే 29: మండలంలోని లక్ష్మాపూర్ 133 కేవీ సబ్ స్టేషన్ పరిధిలో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనున్నట్లు ఏఈ తిరుపతిరెడ్డి గురువారం తెలిపారు. ఫీడర్‌లో లక్ష్మాపూర్‌తో పాటు తొనిగండ్ల, లక్ష్మాపూర్ గిరిజన తండా, సదాశివనగర్ తదితర ప్రాంతాల్లో విద్యుత్ మరమ్మతుల కారణంగా ఉదయం 8 నుంచి 2గంటల వరకు అంతరాయం ఉంటుందన్నారు.

### చిన్నారులకు ఉచితంగా యోగా శిక్షణ


యోగా చేస్తున్న చిన్నారులు

రామాయంపేట, మే 29: ఆయుష్ శాఖ ఆధ్వర్యంలో చిన్నారులకు ఉచితంగా యోగా శిక్షణనిస్తున్నట్లు యోగా గురువు భరత్ పేర్కొన్నారు. గురువారం పట్టణంలోని వెంకటేశ్వర కాలనీలో యోగా నేర్పిస్తున్నట్లు తెలిపారు. చిన్నారులకు ప్రార్థన, ధ్యానం, ప్రాణాయామం ఆసనాలపై అవగాహన కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు.

### దాడికి పాల్పడిన వారిని అరెస్ట్ చేయాలి



నర్సాపూర్, మే 29: గ్రామ సమైక్య వీవో, ఆమె భర్తపై దాడికి పాల్పడిన వారిని వెంటనే అరెస్ట్ చేయాలని మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు కల్లూరి సంజీవ, సంయుక్త కార్యదర్శి ఊరట్ల శివ డిమాండ్ చే శారు. గురువారం నర్సాపూర్‌లో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. బ్రాహ్మణపల్లికి చెందిన నువ్వుల శైలజ గ్రామంలో వీవోగా విధులు నిర్వహిస్తున్నారన్నారు. ఈ నెల 15న అదే గ్రామానికి చెం దిన కమ్మరి వంశీ, కమ్మరి వివేక్‌చారి ఐకేపీ సెంటర్ వద్దకు వెళ్లి తమ వడ్లు తూకం వేయాలని డిమాండ్ చేశారని, మీ నంబర్ రాలేదని, వచ్చాక పెడతామని చెప్పడంతో వీవో శైలజ, ఆమె భర్త మహేశ్‌పై దాడి చేశారన్నారు. అదే రోజు నర్సాపూర్ పోలీస్ స్టేషన్‌లో వీరిపై ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ఈ నెల 19న తూప్రాన్ డీఎస్పీ ఎంక్వైరీ చేశారని, వీరిపై పోలీస్‌స్టేషన్‌లో ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసినట్లు తెలిపారు. కానీ ఇప్పటివరకు వారిని అరెస్ట్ చేయలేదన్నారు. మాల మహానాడు, ఎమ్మార్పీఎస్ నాయకులు పాల్గొన్నారు.